# అలవాటు

అది 2083


దాన్ని "స్పేస్ ఏజ్" అనీ, "ఆటమిక్ ఏజ్" అనీ, "ఎలక్ట్రానిక్ ఏజ్" అని యివ్వేవీ కాకుండా ఏదో "గార్బేజ్" అనో "ఫాసేజ్" అనో పిలుస్తున్నారు. 1983 నాటి 'బ్లూఫ్లేమ్" రేస్ కారూ, "ఎరో ట్రైన్ 92" సూపర్ ఫాస్ట్ రైలూ, "టి.యు.14" సూపర్ సానిక్ ఏరోప్లేనూ వంటి వాహనాలను మ్యూజియంలో పెట్టి "పాపం ఆనాటి అనాగరిక మానవుడు" అని పెదవి విరుస్తున్న రోజులు.

పుట్టగానే మనిషి శరీరంలోకి కొన్ని చమత్కారమైన కాంతి కిరణాలు ప్రవేశపెట్టబడుతున్నాయి. వాటి మూలంగా మనిషి ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు, ఎక్కడికి కావాలనుకుంటే అక్కడికి స్వేచ్ఛగా గాలిలోకి ప్రయాణం చెయ్యగలుగుతున్నాడు. దానితో అతనికి భూవాతావరణం దాటితే తప్ప భూమిమీద అసలు వాహనాల అవసరమే లేకుండా పోయింది.

భూమండలంలో ఎక్కడా ఏ ఆఫీసులూ కనబడటంలేదు. వ్యవసాయమూ, నివాసమూ మాత్రమే ఇక్కడ జరుగుతున్నాయి. మిగిలిన సర్వప్రపంచ వ్యవహారానికీ – భూమికి వెయ్యిమైళ్ళ ఎత్తున రోదసిలో ఒక బ్రహ్మాండమైన ఉపగ్రహం వుంది. అది నిలయం.

మానవుడెంతో ఎదిగిపోయాడు. దేశాలమధ్య సరిహద్దులు లేవు. అధికారాల కోసం కొట్టుకోవడం లేదు. వసుధైక కుటుంబంగా సాగిపోతోంది. ప్రతినిత్యం భూమినుంచి కొన్ని వేలమంది విధి నిర్వహణ కోసం ఉపగ్రహానికి వెళ్ళి వస్తున్నాడు.

భూమికి సుమారు రెండు మైళ్ళ ఎత్తున ప్రతి ప్రాంతంలోనూ భూమ్యాకర్షణ శక్తికి అతీతంగా ఒక ప్లాట్‌ఫారం వంటిది వుంది. భూమి నుంచి ఉపగ్రహానికి వెళ్ళేవాళ్ళందరూ ఎవళ్ళ సమయానికి వాళ్ళు ఆ ప్లాట్‌ఫారం మీదికి చేరుతున్నారు. అక్కడికి రైలో, విమానమో అర్థం కాని పెద్ద "క్యూబికిల్" వంటి వాహనం ఒకటి వస్తోంది. అందరూ దానిలోకి ఎక్కుతున్నారు. అది రెండు నిమిషాలలో ఆ అందరినీ ఉపగ్రహానికి చేరుస్తోంది. తిరిగి అదే పద్ధతిలో విధి నిర్వహణానంతరం ప్లాట్‌ఫారాల మీదికి చేరుకుంటున్నారు.



అవ్వాళే క్రొత్తగా చేరాడొక వ్యక్తి. తిరిగి తన ప్రాంతం చేరుకోవడానికి వెళ్ళే క్యూబికల్ కోసం "వెయిటింగ్ చాంబర్"లో నిలబడ్డారు. రంగు రంగుల క్యూబికల్

వాహనాలు వస్తున్నాయి. ఏ ప్రాంతంవాళ్ళు, ఆ రంగు క్యూబికల్ వచ్చినప్పుడు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, ఒకళ్ళ తరువాత ఒకళ్ళు చాలా క్రమశిక్షణలో లోపలికి ఎక్కుతున్నారు.

ఇంతలో ఒక కాషాయ రంగు క్యూబికిల్ వచ్చింది. అక్కడక్కడ చెదురుమదురుగా నిలబడ్డ కొందరు గబగబా పరిగెత్తుకుంటూ వచ్చి క్యూబికిల్ లోపలికి వెళ్ళే మార్గం దగ్గర, లోపలికి వెళ్ళడానికి తోసుకుంటున్నారు. మరికొందరు వాహనానికున్న కిటికీలగుండా చేతిరుమాళ్ళూ, బ్రీఫ్‌కేసులూ వంటివి లోపలికి సీట్ల మీదికి విసిరివచ్చి గుంపులో తోసుకుంటున్నారు! అంతా నానా గలాభాగా వుంది.

క్రొత్తగా చేరిన ఆ వ్యక్తి ఆశ్చర్యపోయి ప్రక్కనున్న మరొక వ్యక్తిని "ఎవరువాళ్ళు? ఎందుకలా తోసుకుంటున్నారు? ఇంత అభివృద్ధి చెందిన ప్రపంచంలో ఈ క్రమశిక్షణా రాహిత్యం ఏమిటి?" అని అడిగాడు.

అతను సమాధానం చెప్పాడు. "వాళ్ళ గురించి చాలా చెప్పాలి. ఇప్పుడంత టైం లేదు. టూకీగా చెప్తాను. వాళ్ళని ఆంధ్రులంటారు. అలా తోసుకుని ఎక్కితేనేగాని వాళ్ళకి ఎక్కినట్టుండదు. అందులో వందమంది పట్టేచోటున్నా, బయట ఎక్కేవాళ్ళు యిద్దరే వున్నా ఆ ఇద్దరూ అలాగే తోసుకునే ఎక్కుతారు. ఒకవేళ ఎక్కేవాడు ఒక్కడే వున్నాడనుకో, ఎవడి నన్నా పిలిచీ, బతిమాలి మరీ తోయించుకుంటాడు. అదీ తప్పని నువు చెప్పావనుకో, నిన్ను చూసి నవ్వుతారు. అది వాళ్ళకి తెలియక కాదు. వాళ్ళు మహా మేధావులు. ఈ "గార్బేజ్" మహా వైభవానికి వాళ్ళే ప్రధాన కారణం. కాని ఏం చేస్తారు పాపం? కొన్ని వందల యేండ్లుగా వాహనాలలోకి అలా ఎక్కడం వాళ్ళ అలవాటు."